క్లుప్తంగా

పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటా!



రాముడు మృతదేహానికి నివాళులర్పిస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

ఆదిపూడి (కారంచేడు): ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రకాశం జిల్లా పార్టీ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి అన్నారు. శనివారం ఆదిపూడి గ్రామానికి చెందిన గొర్రెముచ్చు రాముడు (68) గుండెపోటుతో మృతిచెందిన విషయాన్ని తెలుసుకొని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. తమ కుటుంబానికి ఎంతో విధేయత కలిగిన వ్యక్తిగా, పార్టీకి నిబద్ధతతో కూడిన కార్యకర్తగా రాముడు తనకు పరిచయమన్నారు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తెను పరామర్శించారు. యర్రం లక్ష్మారెడ్డి, భవనం వెంకటేశ్వర్లు, దేవిరెడ్డి వెంకటేశ్వరెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్తులున్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తులు

కారంచేడు: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పేదలకు ఉచిత విద్య అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరాలకు సంబంధించి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పేద ప్రజలు మీ గ్రామంలో, మీ ప్రాంతంలోని ప్రైవేటు పాఠశాలల్లో చదవాలనుకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లు పేద ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు. గ్రామ సచివాలయాలు, మీ సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

వీఆర్ఏ మృతి



వీఆర్ఏ ప్రభాకర్‌కు నివాళులర్పిస్తున్న డీటీ

పర్చూరు(చినగంజాం): మండలంలోని వీరన్న పాలెం గ్రామ రెవెన్యూ సహాయకునిగా విధులు నిర్వహిస్తున్న జంగా ప్రభాకర్ శనివారం మృతి చెందారు, అనారోగ్య కారణాలతో అతని ఇంటి వద్ద మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృత దేహాన్ని డిప్యూటీ తహసీల్దార్ సుధారాణి సందర్శించి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం ఆయన కుటుంబ సభ్యులకు నగదును అందజేశారు. వీఆర్వో యార్లగడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు

కొమరోలు: కారు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని గోనపల్లె, మదవపల్లె గ్రామాల మధ్యలో శనివారం చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనాన్ని కారు వేగంగా ఎదురుగా ఢీకొనడంతో కోనపల్లె గ్రామానికి చెందిన చెన్నయ్య, వెంకట సుబ్బయ్యకు గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో గిద్దలూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ఎస్సై సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కారు ఆగకుండా వేగంగా వెళ్లిపోయింది.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- ఇంకొల్లు ప్రధాన మురుగు కాలువల్లో నిలిచిన మురుగునీరు
- జమ్ము, పిచ్చిమొక్కలు, నిర్మాణాలతో కునారిల్లుతున్న వైనం
- ముందుకు కదలని మురుగు నీరుతో ప్రజలు అవస్థలు
- ఇంకొల్లులో మురుగు కాలువల్లో ప్రమాద ఘంటికలు
- ప్రజల అవస్థలు– పట్టించుకోని పాలకులు, అధికారులు



మురుగు కాలువలో విపరీతంగా పెరిగిన జమ్ము, పిచ్చిమొక్కలు,నాచు



ఇంకొల్లులో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న డ్రైనేజీ వ్యవస్థ ఇలా..

ఇంకొల్లు(చినగంజాం): మేజర్ పంచాయతీ అయిన ఇంకొల్లులో డ్రైనేజీ వ్యవస్థ ప్రమాదకరంగా మారింది. ప్రజల ప్రాణాలను హరించే విధంగా మురుగు కాలువలు దుస్థితిలో ఉన్నాయి. ఇంకొల్లు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంకొల్లు పట్టణంలో ఎనిమిది ప్రధాన మురుగు కాలువలు ప్రాణాంతకంగా మారాయి. మురుగు కాలువల్లో జమ్ము, తూటాకు, ముళ్ళ పొదలు విపరీతంగా పెరిగిపోయి మురుగు నీరు నిలిచిపోయి సమస్య ఏర్పడుతుంటే మురుగు కాలవలపై నిర్మాణాలు సైతం జరుగుతుండటంతో సమస్య మరింత జటిలం అవుతోంది. దాంతో ప్రధాన మురుగు కాలువలలో మురుగు నీరు నిలిచిపోయి మురుగు నీరు ముందుకు కదలక దోమలకు నిలయాలుగా మారాయి. ముఖ్యంగా రాత్రి వేళ దోమలు విపరీతంగా వ్యాప్తి చెందడంతో ప్రజలు ఇటీవల కాలంలో దోమకాటుకు గురై తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రి పాలై తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇంకొల్లు మురుగు కాలువలు బాగు పరచాలంటే ప్రతి ఒక్కరు మురుగు కాలువలు చూసి బెంబేలెత్తుతున్నారు. వర్షాకాల సమయంలో ఎగువ ప్రాంతం నుంచి వర్షపు నీరు దిగువ ప్రాంతంలోనికి వస్తుండటంతో అక్కడి నివాసితులు గృహాల్లోకి భారీగా వర్షపు నీరు చేరుతోంది. దీంతో అక్కడి ప్రజల జీవనం కొన్ని రోజుల పాటు అస్తవ్యస్తమై పస్తులు ఉండాల్సిన పరిస్థితి కూడా ఏర్పడుతోంది. పేరుకు మేజర్ గ్రామ పంచాయతీ. ఇంటి పన్నుల రూపంలో రూ. 1 కోటికి పైగా ఆదాయం వస్తున్నప్పటికీ మురుగు కాలువల అభివృద్ధి లేకపోవడం గమనార్హం. సంబంధిత జిల్లా అధికారులు కూడా నామ మాత్రంగానే పర్యటించడం తప్ప పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించి కాలువలు అభివృద్ధికి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ఇతర ప్రాంతాలకు భిన్నంగా ఇంకొల్లు డ్రైనేజీ వ్యవస్థ ఇంకొల్లు పట్టణంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ ఉండగా నివాస గృహాలు వారు 350 మురుగు దొడ్ల పైపులను నేరుగా మురుగు కాలువలలోకి వదిలేశారు. గతంలో ఈవోపీఆర్డీగా పనిచేసిన కె. స్వరూపరాణి మురుగు కాలువల్లో మురుగుదొడ్ల పైపులను తొలగించాలని 400 మంది నివాసితులకు నోటీసులు సైతం జారీ చేసినా నేటికీ అది అమలు పరచలేదు. అదే విధంగా ప్రజారోగ్యం దృష్ట్యా నాటి ఎంపీడీఓ విజయలక్ష్మి గ్రామ పంచాయతీలో ఇసుకను తోలించి స్వచ్ఛందంగా ఎవరికి వారు ఒరలు పోసుకొని వాటిని సెప్టిక్ ట్యాంకులకు వాడుకునే విధంగా చర్యలు తీసుకున్నప్పటికీ మురుగు దొడ్లకు సెప్టిక్ ట్యాంకులు కూడా నిర్మించుకోకుండా ఎవరు ఎట్లాపోతే మనకేమీ అన్నట్లుగా మురుగు దొడ్లపైపులను నేరుగా కాలువలలోకి వదిలేశారు. ఇంకొల్లు పట్టణంలో ప్రధానంగా ఎనిమిది మురుగు కాలువలకు పూర్తి స్థాయిలో పూడిక తీయవలసిన అవసరం ఎంతైనా ఉంది. మేజర్ గ్రామ పంచాయతీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బంది పూర్తి స్థాయిలో లేకపోవడం అందుకు అవసరమైనటువంటి నూతనంగా సాంకేతిక మిషనరీ లేకపోవడం ప్రధాన కారణం. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు సంబంధిత మండల అభివృద్ధి అధికారులు, జిల్లా అధికారులు పూర్తి స్థాయిలో పరిశీలించి మురుగు కాలువల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి

గ్రామ మొత్తం మురుగు నీరు కడవకుదురు రోడ్డు వెంబడి ఒకటో మైళ్ళు బ్రిడ్జి వద్ద ఉన్న అప్పేరు వాగులో కలుస్తుంది. మురుగు కాలువలు వేసవి కాలంలో అయినా పూర్తి స్థాయిలో పూడిక తొలగిస్తే కానీ మురుగు నీరు నిలబడకుండా కడవకుదురు రోడ్డు వరకు వెళుతుంది. కొన్ని చోట్ల పూర్తిగా కాలువలు పూడిపోయాయి. కల్వర్టులు నిర్మాణం చేయాల్సిన ఉంది. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు నేటికి తొలగించి బ్రిడ్జి నిర్మాణాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇంకొల్లు మేజర్ గ్రామ పంచాయతీని నగర పంచాయతీ హోదా కల్పించి అందుకు అవసరమైన ట్రాక్టర్‌లు, పారిశుద్ధ్య ట్రాక్టర్‌లు, పారిశుద్ధ్య మిషన్‌లు ఒనగూరే పరిస్థితి ఉంది. ప్రస్తుతం విధులు కొరత కారణంగా ఇవేమీ జరగడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

సుమారు 30 వేల మంది జనాభా ఉన్న ఇంకొల్లు పట్టణంలో స్పిన్నింగ్, అయిల్ మిల్లులు, వ్యవసాయ పనిముట్లు తయారు చేసే పరిశ్రమలు కారణంగా ఎంతో మంది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు ప్రధాన మురుగు కాలువలు సర్వే చేసి మురుగు కాలువల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

అంతేగాకుండా మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో రాత్రి వేళ ప్రతి రోజు ఫాగింగ్ నిర్వహించటం. మురుగు కాలువల్లో బ్లీచింగ్, ఫినాయిలు చల్లించడం వంటి జరగాలి, మురుగు కాలువల్లో ఆయిల్ బాల్స్ వేస్తే కొంత మేరకు దోమల వ్యాప్తి తగ్గి ప్రజలు దోమల కాటుకు బలి కాకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

5వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు

అద్దంకి: ఈ నెల ఐదో తేదీ నుంచి ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శింగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా ఈ నెల 5వ తేదీన డిజిటల్ అసిస్టెంట్ దేవరకొండ కార్తిక్ ఆధ్వర్యంలో కుంకుపాడు, మధుసూదనరావు ఆధ్వర్యంలో కొటికలపూడి సచివాలయాల్లో, ఈ నెల 6వ తేదీన నాగులపాడు, తిమ్మాయపాలెం, వేలమూరిపాడు గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహిస్తామని తెలిపారు. 8వ తేదీన బొమ్మనంపాడు, మణికేశ్వరంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 12న జార్లపాలెం, శింగరకొండపాలెం, 13న చక్రాయపాలెం, కలవకూరు, 14న వెంపరాల, శంఖవరప్పాడు, 15న ఉప్పలపాడు, ధర్మవరం గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులను ఆయా గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



మాట్లాడుతున్న గ్రంథపాలకుడు

సంతమాగులూరు(అద్దంకి): పుస్తకాలు చదవడం వలన మనకు విజ్ఞానం కలుగుతుందని గ్రంథపాలకుడు విజయభాస్కరరెడ్డి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో ఆయన వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా శనివారం విద్యార్థులకు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. మేధావులు ఎంతో మంది తమ మేధస్సును ఉపయోగించి, మరికొందరు నేర్చుకున్నది పుస్తక రూపంలో భావి తరాలకు అందించారని గ్రంథపాలకుడు అన్నారు. ఆయాపుస్తకాలతో పాటు, గొప్పవారి జీవిత విశేషాలున్న పుస్తకాలను చదవడం ద్వారా, వారి బాటలో నడిస్తే మీరు గొప్పవారు కావచ్చని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టి కృషి

- గౌతమ బుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ కమిటీ నిర్ణయం

కారంచేడు: గ్రామంలో ప్రధానంగా ఉన్న యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పునః ప్రారంభానికి అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను చేర్పించేలా తల్లిదండ్రులను ఒప్పించడం, మోడల్ స్కూల్ డెవలప్‌మెంట్‌కు గ్రామస్తుల సమిష్టి కృషి అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో దగ్గుబాటి రాఘవయ్యచౌదరి భవనంలో గ్రామస్తుల సహకారంతో నెలకొల్పిన గౌతమ బుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు కీలకమైన నిర్ణయాలు తీసుకున్నారు. గ్రామంలో ప్రధానంగా కొన్ని సంవత్సరాలుగా ఉన్నత పాఠశాల లేకపోడంతో విద్యార్థులు పడిన అవస్థలను వారు చర్చించారు. భవిష్యత్తు కాలంలో ఇలాంటి సమస్యను రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 9,10 తరగతుల విద్యార్థులకు సొసైటీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి గ్రామంలో ప్రారంభమయ్యే ఉన్నత పాఠశాలకు, మోడల్ స్కూల్‌కు అవసరమైన మౌలిక వసతులతో పాటు, గ్రామంలో గ్రామస్తుల కోరిక మేరకు అవసరమైన శిక్షణ తరగతుల నిర్వహణను కూడా ఏర్పాటు చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తామన్నారు. మహిళలు, యువత వారి కాళ్ళపై వారు నిలబడేలా వారికి అవసరమైన శిక్షణలు ఇస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. సర్వతోముఖాభివృద్ధిలో గ్రామస్తులు తమ వంతు కృషి చేయడంతో పాటు, ప్రజల్లో చైతన్యం కల్పించాల్సి ఉందన్నారు. సమగ్రాభివృద్ధికి దాతలు సహకారం ఎంతో అవసరమని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. ముందుగా గౌతమబుద్ధుని విగ్రహంతో పాటు, ప్రముఖ సంఘ సంస్కర్త యార్లగడ్డ దుర్గయ్యబాబుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సరస్వతీదేవి చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, మాజీ ఎంపీపీ డాక్టర్ యార్లగడ్డ రాఘవయ్య, చుండూరి రామయ్య, మాజీ సర్పంచ్ ఊటుకూరి వెంకటేశ్వర్లు, దగ్గుబాటి ఆంజనేయుడు, జీఎస్ఆర్ ఆంజనేయులు, యార్లగడ్డ శ్రీనివాసరావు, యార్లగడ్డ పాపారావు, ఉపాధ్యాయులు పావులూరి శ్రీనివాసరావు, చాగంటి రాజేష్, పాదిలి మురళీకృష్ణ, శ్రీమన్నారాయణ, శ్రీనివాసరావు, శ్రీరామకృష్ణ, గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.



కారంచేడులో సమావేశానికి హాజరైన ఎంఈఓ, సొసైటీ సభ్యులు, గ్రామస్తులు

బ్రహ్మానందరెడ్డిని కలిసిన నాయకులు



బత్తుల బ్రహ్మానందరెడ్డిని కలిసిన పర్చూరు నాయకులు

పర్చూరు(చినగంజాం): వైఎస్సార్ సీపీ ప్రకాశం జిల్లా పరిశీలకులుగా నూతనంగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని పర్చూరుకు చెందిన నాయకులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన స్వగృహం యర్రం వారిపాలెంలో ప్రత్యేకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. భవిష్యత్‌లో ఇటువంటి పదవులు చేపట్టి పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యకర్తలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయనను కలిసిన వారిలో పర్చూరు మండల పార్టీ కన్వీనర్ కఠారి అప్పారావు, బాపట్ల జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఎం. జగన్నాథం, లంకా శివ, పి. నాగేశ్వరరావు, మాజీ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, వేణుగోపాల స్వామి దేవస్థానం చైర్మన్ రావువారి ప్రసాద్, దేవిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భవనం రాజగోపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, కారంచేడు వైస్ ఎంపీపీ యార్లగడ్డ సుబ్బారావు, యార్లగడ్డ బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు తమ బాధ్యతలు మరవద్దు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ

చీరాల రూరల్: కార్మికులు తమ హక్కుల సాధన కోసం పోరాటాలు చేయడమే కాకుండా తమ బాధ్యతలు కూడా నెరవేర్చాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. అంతర్జాతీయ కార్మిక వారోత్సవాల్లో భాగంగా ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ చీరాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక డీఎస్ఆర్ హ్యాండ్లూమ్స్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ పాల్గొని మాట్లాడారు. కార్మికులంతా ఏకతాటిపై నిలిచి హక్కుల సాధనకోసమే కాకుండా మన బాధ్యతలు కూడా తెలుసుకుని సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అలానే పనిచేసే ప్రదేశంలో కార్మికులకు అవసరమైన సదుపాయాలను యాజమాన్యం ఏర్పాటు చేయాలని చెప్పారు. పురుషులతో పాటు స్త్రీలకు సమానంగా వేతనాలు చెల్లించాలని సూచించారు. అలానే ప్రభుత్వ పథకాలను కార్మికులకు అందేలా చూసే బాధ్యత యాజమాన్యాలదేనన్నారు. నిరుపేదలు, మహిళలు, దీర్ఘకాలిక సమస్యలు గలవారు, వృద్ధులు, వికలాంగులు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అందజేసే ఉచిత న్యాయ సేవలను పొందుకోవాలని సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ పేరుపై చిన్న కార్డు ముక్క రాసినా సమస్యలపై స్పందించి న్యాయ సహాయమందిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి. రమేష్‌బాబు, మహిళా ప్రతినిధి యు. స్నేహ, న్యాయవాది ఎ. రామకృష్ణారెడ్డి, డీఎస్ఆర్ సంస్థ నిర్వాహకులు శివయ్య, పారా లీగల్ వలంటీర్ మతిన్, కార్మికులు పాల్గొన్నారు.

శింగరకొండ దేవస్థాన రికార్డులు కంప్యూటరీకరణ



శింగరకొండ దేవస్థాన వివరాలు కంప్యూటరీకరణ చేస్తున్న ఉద్యోగులు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన రికార్డులను కంప్యూటకరణ చేస్తున్నట్లు దేవస్థాన ఏసీ తిమ్మానాయుడు తెలిపారు. దేవస్థాన పరిధిలోని 1970 నుంచి దేవస్థానానికి సహకరించిన శాశ్వత ఆకుపూజలు, శాశ్వత అభిషేకాలు, శాశ్వత పూజాకార్యక్రమాలు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, శాశ్వత అన్నదానానికి సహకారం అందించిన భక్తుల వివరాలను భావి తరాలకు అందించేందుకు కంప్యూటీకరణ చేస్తున్నట్లు తెలిపారు. 20 రోజుల నుంచి జరుగుతున్న కార్యక్రమంలో ఇప్పటికి 7000 వరకు రసీదులు కంప్యూటీకరణ చేసినట్లు తెలిపారు.

బీసీ సంఘ అధ్యక్షుడిగా మల్లికార్జునరావు



పంగులూరు బీసీ సంఘం నాయకులను అభినందిస్తున్న దృశ్యం

జె.పంగులూరు: మండల బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షునిగా కందుకూరి మల్లికార్జునరావు ఎన్నికయ్యారు. శనివారం పంగులూరులో జరిగిన బీసీల సమావేశంలో మల్లికార్జునరావుకు నియోజకవర్గ అధ్యక్షుడు రవిచంద్ర నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ బీసీ సంఘ అధ్యక్షుడు నాయకులు రావూరి శ్రీనివాసరావు, పీరు సాహెబ్, సాంబశివరావు, చంటి, కొత్త నాగేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, ఎల్‌బీసీ పీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాలు పర్యటించి బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మండల అధ్యక్ష పదవి రావటానికి సహకరించిన బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన్న శంకర్ రావు, జిల్లా అధ్యక్షుడు బాపట్ల రవి కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు రవిచంద్రకి కృతజ్ఞతలు తెలిపారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోండి



స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ

చీరాల అర్బన్: శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు డి.ధనమ్మ శనివారం తెలిపారు. జూన్ 6వ తేదీ వరకు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పిల్లల చేత నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు చదివించి వారిచేత మరలా కథలు చెప్పించారు. ఇంగ్లిషు ఫ్యాకల్టీ షేక్ కమల్‌బాబు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు తరగతులు నిర్వహించారు. కాంపిటీటివ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కొరకు గ్రంథాలయాన్ని సాయంత్రం వరకు తెరచి ఉంచుతున్నట్లు ఆమె తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిపైనున్న గోపాలపురం గ్రామ సమీపంలో ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొన్నాయి. ఒకరికి గాయాలయ్యాయి.

శింగర కొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం వైశాఖ మాసం పుష్యమి నక్షత్రం సప్తమి తిథి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రాతి ముఖ మండప నిర్మాణానికి విరాళాలు



విరాళం అందజేస్తున్న దాతలు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగర కొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖమండప నిర్మాణానికి శనివారం దాతలు విరివిగా విరాళాలు అందజేశారు. శంకరాపురం గ్రామానికి చెందిన కూరపాటి ఏడుకొండలు, కోటేశ్వరమ్మ దంపతులు రూ. 1,01,116 శింగరకొండ పాలెం గ్రామానికి చెందిన సురభి జక్రయ్య, చిరంజీవి అభిమాని రూ. 10,116 అందజేశారు. అద్దంకి క్రాంతి నగర్ కు చెందిన శ్రీరామ హనుమంతరావు, జయలక్ష్మి దేవస్థాన మారుతిభవన్‌కు కావాల్సిన సామగ్రిని ఏసీ యం. తిమ్మనాయుడుకు అందజేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అద్దంకి రూరల్: పురుగు మందు తాగి వైద్యశాలలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై రవితేజ కేసు నమోదు చేశారు. మండలంలోని కొత్తరెడ్డి పాలెం గ్రామానికి చెందిన అంజయ్య (54) ఏపని చేయకుండా రాయలసీమలోని వజ్రాలు వేటకు తరచూ వెళుతుంటాడు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసై గ్రామంలో సుమారు రూ. 4 లక్షల మేర అప్పు చేశారు. ఈ క్రమంలో భార్య ఈశ్వరమ్మతో ఈనెల 29న గ్రామంలోని పొలంలో పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి భార్యకు చెప్పాడు. వెంటనే అద్దంకి ప్రయివేటు వైద్యశాలకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.